క్లుప్తంగా

సర్వేపల్లి సేవలు ఎనలేనివి



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: మండలంలోని తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చదువుల విశ్వనాథం మాట్లాడుతూ సర్వేపల్లి ఉపాధ్యాయుడిగా, రాష్ట్రపతిగా దేశానికి ఎన్నో సేవలు చేశారన్నారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు దోకిపర్తి షణ్ముఖరావు వర్ధంతిని నిర్వహించారు. ఎస్.రామరాజు, బందన శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరును బాగు చేయిస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు

ఆమదాలవలస: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మంచి నీటి బోరును వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చల్లా సింహాచలం ఆధ్వర్యంలో గురువారం బాగుచేశారు. తాగు నీటి బోరు మరమ్మతులకు గురై మూలకు చేరడంతో వేసవిలో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. బోరును బాగు చేయించి వాడుకలోకి తీసుకువచ్చారు. చల్లా కామేశ్వరరావు, చల్లా శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొమ్మిక ఆశ్రమ పాఠశాల పరిశీలన



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: మండలంలోని బొమ్మిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం పరిశీలించారు. భోజన సదుపాయాలు, స్టాక్ రికార్డులు, భోజన గదిని, వంటగది పరిసరాలు, ఆర్వో ప్లాంట్‌ను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులకు, నిల్వకు తేడాలను గుర్తించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. భోజనం రుచిగా లేకపోవడంతో వార్డెన్ మీనాక్షిని ప్రశ్నించారు. అధ్యాపకుల హాజరును పరిశీలించారు. హెచ్‌ఎం కె.త్రినాథరావు, రాజ్యలక్ష్మి, నీలకంఠేశ్వరరావు, పద్మ పాల్గొన్నారు. అనంతరం సింగుపురం గ్రామం వద్ద రూ.1.60 కోట్ల ఉపాధి నిధులతో శంకుస్థాపన చేశారు. పీఆర్ డీఈ ప్రసాదరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ తిరుపతిపట్నాయక్, ఏపీఓ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టుదల ముఖ్యం



అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ నిపుణుడు

నరసన్నపేట: విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే పట్టుదల, సంకల్పం అవసరమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు జాయి బీ హాన్స్ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో కెరీర్ కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. విద్యా విజ్ఞానంతో పాటు సామర్థ్యం, నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. అప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతీ విద్యార్థి కెరీర్ పైనే దృష్టి పెట్టాలన్నారు. కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రశాంత్‌కుమార్

హిరమండలం: పదో తరగతి తరువాత ఉద్యోగ, ఉపాధిని ఇచ్చే ఎన్నో రకాల విద్యా కోర్సులు అందుబాటులో ఉంటాయని నిపుణులు సూచించారు. స్థానిక కేజీబీవీలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు తదుపరి విద్యావకాశాలను వివరించారు. కెరీర్ గైడెన్స్‌పై క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ప్రశాంత్‌కుమార్ సమగ్ర అవగాహన కల్పించారు. పదో తరగతి తరువాత ఉండే విద్యావకాశాలను వివరించారు. ఎస్‌ఓ కృష్ణవేణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి కాలం.. పశువులు భద్రం



ఎండలోనే మేత మేస్తున్న ఆవులు

- పొంచి ఉన్న వడదెబ్బ ముప్పు
- నిర్లక్ష్యం వహిస్తే మృత్యువాత పడే అవకాశం
- సకాలంలో రక్షణ చర్యలతో పశు సంరక్షణ సాధ్యం

ఆమదాలవలస నియోజకవర్గంలో పశుసంపద వివరాలు..

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
ఆమదాలవలస	11,228	657	11,347	2,910
సరుబుజ్జిలి	9,361	88	9,386	4,055
బూర్జ	10,531	14	11,219	4,591
పొందూరు	14,834	596	24,412	8,239

ఆమదాలవలస: వేసవిలో మూగజీవాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడంతో పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలున్నాయి. ఈ ప్రభావంతో పాల దిగుబడి తగ్గడమే కాకుండా, ప్రాణాపాయ పరిస్థితులను మూగజీవాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పశువుల శరీర ఉష్ణోగ్రతల కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు నియంత్రణ కోల్పోతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతుంది. అపస్మారక స్థితిలోకి వెళ్లి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమే..

వడదెబ్బ తగిలిన ఆవుల్లో శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉంటుంది. చర్మ మృదత్వం తగ్గిపోయి గట్టిపడుతుంది. నోటితో గాలి పీల్చుకోవడం, నోటి వెంట చొంగ కారటం జరుగుతుంది. ఆవుల్లో పాల దిగుబడి, పునరుత్పత్తి, చూడికట్టే శాతం తగ్గుతుంది. ఎద్దుల్లో వంధత్వం వస్తుంది. తీవ్రత ఎక్కువ అయినప్పుడు పక్షవాత లక్షణాలతో క్రమంగా కోమాలోకి వెళ్లి మత్యువాత పడతాయి.



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

చికిత్స విధానం..

వడ దెబ్బకు గురైన మూగజీవాలను వెంటనే నీడ ప్రాంతానికి చేర్చాలి. అవకాశం ఉంటే ఫ్యాన్లు, కూలర్ల ద్వారా చల్లని గాలి అందించాలి. బాగా ఎండ ఉన్న సమయాల్లో పశువులను చల్లని నీటితో శుభ్రం చేయాలి. చల్లని నీరు తాగటానికి అందుబాటులో ఉంచి నొప్పులను తగ్గించడానికి నివారణ మందులను వాడాలి. వైద్యుల పర్యవేక్షణలో పశువుల రక్తంలోకి లవణ ద్రావణాలు ఎక్కించాలి.

నివారణ చర్యలు..

వేసవిలో పశువులను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మేతకు బయటకు తీసుకువెళ్లకూడదు. చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలి. రోజుకి 4 నుంచి 5 సార్లు చల్లని నీటితో కడగడం, చెరువులు, కుంటలు ఉన్న చోట నీళ్లలోకి విడిచిపెట్టాలి. పశువుల కొట్టాలను ఎత్తుగా నిర్మించుకొని పైన ఎండు గడ్డితో కప్పి నీళ్లు చల్లుతూ ఉండాలి. పశువుల పాకల్లో వడగాలి వస్తున్న దిక్కుల్లో సంచులు కట్టి నీరు చల్లుతుండాలి. నీటి శాతం ఎక్కువగా ఉన్న పచ్చిగడ్డి, పాతర గడ్డి, హైడ్రోఫోనిక్స్ గడ్డి పెట్టాలి. ఎక్కువగా దాణా, ఉడికించిన ధాన్యాలు పెడుతున్నప్పుడు కొంచె వంట సోడా కలపడం వల్ల ఎండ ధాటికి గురైన పశువుల్లో వచ్చే అజీర్తి సమస్యలను నివారించవచ్చు.

జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో మూగజీవాలు వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఉంటాయి. వడదెబ్బ తగిలితే తక్షణమే చల్లని ప్రదేశానికి వాటిని తరలించాలి. వడదెబ్బ తగిలిన పశువులకు వైద్యం అందించాలి. మధ్యాహ్న సమయాల్లో మూగజీవాలను బయటకు విడిచిపెట్ట వద్దు. రోజుకి ఐదుసార్లు మూగజీవాలను నీటితో శుభ్రం చేయడం మంచిది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే మూగజీవాలు వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. దీనిపై గ్రామాల్లో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ రోణంకి ఆనందరావు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, ఆమదాలవలస

తమ్మినేనికి అభినందనలు



తమ్మినేని సీతారాంను అభినందిస్తున్న రాంబాబు, తదితరులు

ఆమదాలవలస: మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తమ్మినేని సీతారాంను పార్టీ అధిష్టానం ఇటీవల పీఏసీ మెంబర్‌గా నియమించింది. ఆయనను ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో బూర్జ మండలానికి చెందిన మామిడివలస ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి రాంబాబు, తదితరులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బూర్జ మండలం తోటవాడ గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుల చెరువు సుందరీకరణపై కసరత్తు



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీఓ

నరసన్నపేట: పట్టణంలో ఉన్న రాజుల చెరువు సుందరీకరణపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఆర్డీఓ సాయి ప్రత్యూష గురువారం సమీక్ష చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ వసతి గృహంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజుల చెరువును ఎలా అభివృద్ధి చేయాలి.. నీటి సదుపాయం, చెరువు చుట్టూ సుందరీకరణపై చర్చించారు. ప్రస్తుతం ఉన్న ఆక్రమణలు, ఇళ్లు, దుకాణాల పరిస్థితిని తెలుసుకున్నారు. చెరువుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. చెరువు అభివృద్ధిపై పూర్తి నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటికే దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ మధుసూదనరావు, పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, ఇరిగేషన్, ఉద్యానవన, పంచాయతీరాజ్, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పంటలతో మేలు



ప్రకృతి పంటలను విక్రయిస్తున్న లలిత, తదితరులు

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో పండించిన పంట దిగుబడులు తినటం వలన ఆరోగ్యానికి మేలు చేస్తాయని ప్రకృతి వ్యవసాయ మండల యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ప్రకృతి వ్యవసాయ పంటల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కూరగాయలు విక్రయించారు.


శిథిలావస్థలో..



బూర్జ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనాన్ని కూల్చి.. దీని స్థానంలో వైద్యశాల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీర్ఘకాలిక రోగులతో నిత్యం రద్దీగా ఉన్న వైద్యశాలకు సొంత భవనం లేక పోవడంతో బూర్జతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం శిథిలమైన తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న వీఆర్వో రికార్డు రూమ్‌లో రోగులకు వైద్య సేవలు అందజేస్తున్నారు.

- బూర్జ

అంత్యక్రియలకు అష్టకష్టాలు



సరుబుజ్జిలి మండలంలోని విజయరాంపురం పంచాయతీ పరిధిలోని కె.జె.పేటలో శ్మశాన వాటిక నిర్మించినా.. నిర్వహణ సక్రమంగా లేదు. ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు చేసేందుకు అవస్థలు పడుతున్నారు. శ్మశాన వాటిక చుట్టూ గుబురుగా పిచ్చిమొక్కలు పెరిగాయి. రన్నింగ్ వాటర్, విద్యుత్ సదుపాయం లేదు. అధికారులు స్పందించి శ్మశాన వాటికను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

పాఠశాలను రద్దు చేయవద్దు



సారవకోట మండలంలోని పెద్దలంబ ప్రాథమికోన్నత పాఠశాలను రద్దు చేయవద్దని కోరుతూ ఆ గ్రామస్తులు ఎమ్మార్వో కార్యాలయ సిబ్బందికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ ప్రభుత్వం పాఠశాలల పునర్ నిర్మాణంలో భాగంగా తమ గ్రామ పాఠశాలను బేసిక్ పాఠశాలగా మార్చేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. ఆ విధానం తమకు అవసరం లేదన్నారు. ప్రస్తుతం ఉన్నట్లే 1 నుంచి 7వ తరగతి వరకు యథావిధిగా కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారని, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జి.యోగేంద్ర, వైస్ చైర్‌పర్సన్ ఐ.వాణిశ్రీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

- సారవకోట

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పాతపట్నం మండలంలోని తెంబూరు ప్రభుత్వ హోమియో ఆస్పత్రి వైద్యురాలు ఎస్.ఉమాగౌరి అన్నారు. తెంబూరులో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైద్యురాలు మాట్లాడుతూ వెయ్యి రోజుల సంరక్షణ, పోషణ విలువలు, ఆరోగ్యకరమైన ఆహార స్వీకరణపై గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

- పాతపట్నం

చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన



నరసన్నపేట: చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



జలుమూరు: విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు



పాతపట్నం: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సరుబుజ్జిలి: ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై అవగాహన కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ బాలరాజు తెలిపారు. వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో పాల్గొంటారన్నారు. సీఆర్పీ బెండి చిన్నారావు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గురువారం మండల స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. 10 ఉన్నత పాఠశాలల నుంచి వంద మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి మూడు స్థానాలు పొందినవారికి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ శాంతారావు తెలిపారు.

జలుమూరులో..

జలుమూరు: ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంఈఓలు బి.మాధవరావు, ప్రసాదరావు అన్నారు. గురువారం శ్రీముఖలింగంలో ఆలివ్ రిడ్లేల సంరక్షణపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మొత్తం 142 మంది విద్యార్థులు హాజరయ్యారు. రావాడ భాగ్యశ్రీ ప్రథమ, వాన వసంత ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి ఎంఈఓలు, ఉపాధ్యాయులు అభినందించారు.

పాతపట్నంలో..

పాతపట్నం: ఆలివ్ రిడ్లేల సంరక్షణపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి చిత్రలేఖనం పోటీలను నిర్వహించినట్లు ఎంఈఓ–2 సి.హెచ్.తిరుమలరావు తెలిపారు. మండలంలోని 33 పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. మండల స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని ఎంఈఓ తెలిపారు. రొంపివలస హెచ్‌ఎం ఎస్.కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



రాములమ్మ (ఫైల్)

ఆమదాలవలస: మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ (తులగాం) గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కళింగపట్నం రాములమ్మ (64) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతిరాలికి కుమారుడు సింహాచలం, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త ఇదివరకే మృతి చెందారు. ఆమె మృతి పట్ల గ్రామ నాయకుడు గేదెల చిన్నబాబు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎఫ్‌ఏ యోగిత

పాతపట్నం: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రకృతి వ్యవసాయమే కీలకమని ఎన్‌ఎఫ్‌ఏ యోగిత అన్నారు. మండలంలోని గంగువాడ పంచాయతీ మెట్టుపేటలో కూరగాయల సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. 20 సెంట్ల విస్తీర్ణంలో ఏటీఎం మోడల్‌లో విత్తనాలు, నారు వేయడం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరావు

ఆమదాలవలస: మండలంలోని వంజంగి గ్రామ సచివాలయాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. వర్క్ ఫ్రమ్ హోమ్, హౌస్ హోల్డ్ జియో కో ఆర్డినేట్స్, రైస్ కార్డుల ఈకేవైసీ, మనమిత్ర వాట్సాప్ సర్వీసెస్ తదితర అంశాలపై పూర్తిస్థాయిలో సచివాలయ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

కల్తీ ఆహారంపై అప్రమత్తం

నరసన్నపేట: విద్యార్థులు, యువత కల్తీ ఆహారంపై అప్రమత్తంగా ఉండాలని, కుటుంబ సభ్యులను కల్తీ ఆహారంపై అవగాహన కల్పించాలని ఆహార కల్తీ నిరోధక జిల్లా అధికారి రత్నం, కోటబొమ్మాళి సీహెచ్‌సీ వైద్యుడు పొన్నాడ గణేష్ అన్నారు. స్థానిక రాజగోపాల్ ఐటీఐ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కల్తీ ఆహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రత్నం మాట్లాడుతూ ఆహార ధాన్యాలు, పప్పులు, ఇలా అన్నింటిలో కల్తీ ఉంటుందన్నారు. నిల్వ పదార్థాలు, ఆయిల్ వంటివి వినియోగిస్తే అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందన్నారు. వీటిని గుర్తిస్తూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



ఎల్.ఎన్.పేట: అప్పారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: డబ్బీరు రఘు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణచైతన్య, తదితరులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు కుటుంబాలను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి గురువారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ముగడ అప్పారావు, లక్ష్మీనర్సుపేట ఉప సర్పంచ్ అశోక్ పాణిగ్రాహి తండ్రి లక్ష్మీనారాయణ పాణిగ్రాహి, కవిటి గ్రామానికి చెందిన తలసముద్రం లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను రెడ్డి శాంతి పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ తలసముద్రం కుమారి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పార్టీ మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, లక్ష్మీనర్సుపేట సర్పంచ్ ముగడ దివాకర్ నాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు ఈగల చిన్నారావు, గేదెల శ్రీనివాసరావు, కొల్ల లక్ష్మునాయుడు, రామ్‌నాథ్ పాణిగ్రాహి, ఎర్ర జనార్దన, పెద్దకోట రాము, బలగ గోవిందరావు తదితరులు ఉన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: మండలంలోని రెల్లివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లుకలాపు వరప్రసాద్ కుటుంబం ఎల్.ఎన్.పేట మండలం గార్లపాడులో నివాసం ఉంటుంది. ఈయన భార్య వసంత ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. ఆమెను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, తదితరులు ఉన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: మండలం కేంద్రంలోని పలు కుటుంబాలకు పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య గురువారం పరామర్శించారు. మారుతీనగర్–1కు చెందిన విశ్రాంత ఎంపీడీఓ, శిష్టకరణ సంఘం ప్రతినిధి డబ్బీరు రఘు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని కృష్ణచైతన్య పరామర్శించారు. బండి వీధికి చెందిన కేవిటి సూర్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బండి వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ధర్మాన తేజ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనను పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వార్డు సభ్యుడు బుజ్జి, ఎంపీటీసీ నేతింటి రాజేశ్వరరావు, పార్టీ నాయకులు బుద్దల రాజశేఖర్, దండి జయప్రకాశ్, పాగోటి భరద్వాజ్, తదితరులు ఉన్నారు.



హిరమండలం: కిట్టాలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌ఎం రాజాబాబు, విద్యార్థులు



సారవకోట: లక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



జలుమూరు: శ్రీముఖలింగంలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓలు, ఉపాధ్యాయులు అన్నారు. పలు గ్రామాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకార పత్రాలను అందించారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: నారాయణవలసలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నరసన్నపేట: తమ్మయ్యపేటలో ఎంఈఓ, ఉపాధ్యాయులకు అంగీకారపత్రం అందజేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు



పొందూరు: లోలుగులో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు